
జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ
డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
వీక్షించండి
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం.. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.
ఎడిటర్: చౌదరి, 9963063761

మంగళవారం | 22-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 789 పేజీలు: 4 వెల : రూ.7



# టీడీపీలో సప్తస్వరాలు






* ముున్సిపల్ చైర్మన్ రేసులో ఏడుగురు అభ్యర్థులు
* పరిశీలకుల ఎదుట అభిప్రాయ సేకరణ
* పట్టణ అధ్యక్షుడు ఎన్నిక తరహాలోనే సీక్రెట్ ప్రశ్నల వర్షం
* కొలిక్కి వచ్చిన ఆశావాహుల జాబితా
* పోటీ నుండి తప్పుకున్న దినేష్
* ఐవీఆర్ఎస్ విధానంలోనూ అభిప్రాయ సేకరణ





ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 21 (వార్త): తెలుగుదేశం పార్టీ నుండి ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్మన్ రేసులో ఆశావాహల జాబితా ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. ఏడుగురు అభ్యర్థులు తాము టిక్కెట్ ఆశిస్తున్నట్లు పరిశీలకులు ఎదుట అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ క్యాంప్ కార్యాలయంలో చర్చించినట్టు సమాచారం. రోజురోజుకీ ఆశావాహన జాబితా చాంతాడుల పెరిగిపోవడంతో దానికి ఫుల్ స్టాప్ పెట్టేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో పట్టణ అధ్యక్షుని ఎన్నిక నిర్వహించిన తరహాలోనే రహస్యంగా ఒక్కొక్కరిని పిలిచి అభిప్రాయ సేకరణ చేశారు. తెలుగుదేశం పార్టీ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు ఎమ్మెల్యే ఎండి నజీర్, జిల్లా టిడిపి అధ్యక్షులు మొదలవలస రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరుకట్ల విట్టల్ తదితరులు ఆధ్వర్యంలో అభిప్రాయసేకరణ జరిగింది. పట్టణ మాజీ అధ్యక్షులు సీనియర్ తెలుగు దేశం నాయకులు కాళ్ల ధర్మారావు, తనకు గానీ తన కుమారుడు జయదేవ్ యాదవ్‌కి గాని కేటాయించాలని కోరారు. ప్రస్తుత పట్టణ అధ్యక్షుడు పత్రి తవిటయ్య తాను కూడా చైర్మన్ బరిలో ఉన్నట్లు కమిటీ ముందు చెప్పారు. మాజీ కార్యదర్శి నందికి జానీ, రాష్ట్ర కార్యదర్శి సాలీన ఢిల్లీ యాదవ్, జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఆసి లీలా రాణి, 22వ వార్డు మాజీ కౌన్సిలర్ కాళ్ల దిలీప్ యాదవ్, ప్రముఖ బంగారం వర్తకులు వెచ్చ కేశవరావులు తాము కూడా పోటీ చేస్తామని ముందుకు వచ్చారు. అభిప్రాయ సేకరణలో అభ్యర్థి చెప్పే విషయం కంటే పరిశీలకుల నుండే ప్రశ్నల వర్షం కురిసినట్లు సమాచారం. ఐ వి అర్ ఎస్ విధానం ద్వారా కూడా అభిప్రాయ సేకరణ ఉంటుందని చెప్పారు అంతకుముందు జరిగిన సమావేశంలో ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో ఎలాగైనా చైర్మన్ సీటును దక్కించుకోవాలని కోరారు. అసెంబ్లీకి మున్సిపాలిటీకి ఎన్నికల్లో ఎందుకు తేడా వస్తుందని ప్రశ్నించారు. 28 వార్డులు గెలిచి వార్ వన్ సైడ్ లాగా మున్సిపాలిటీని బహుమతిగా ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉండగా ఇటీవలే పార్టీలో సంచలనంగా మారిన బంగారం వ్యాపారవేత్త పైడిశెట్టి దినేష్ కుమార్ పోటీ నుండి తప్పుకున్నారు. ఆయన ఎటువంటి బయోడేటాను పరిశీలకులకు ఇవ్వలేదు. అయితే సమావేశం ప్రారంభానికి ముందే దినేష్‌కు హితభోద జరిగినట్లు సమాచారం.

## పాఠశాల ప్రాంగణంలో మద్యం, మలవిసర్జన

* ప్రహరీ లేక విద్యార్థులు, ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బందులు
* మురుగునీటి కాలువలతో దుర్వాసన
* ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్న ఆరోపణలు

సంతబొమ్మాళి, సెప్టెంబర్ 21 (వార్త): తెనిగిపెంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు కనీస వసతుల లేమి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. పాఠశాలకు ప్రహరీ నిర్మాణం లేకపోవడంతో రాత్రివేళల్లో, సెలవు రోజుల్లో గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల ప్రాంగణంలో మద్యం సేవించడం, మలవిసర్జన చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. దీంతో ఉదయం పాఠశాలకు వచ్చే ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల ఆవరణలో మద్యం సీసాలు, వ్యర్థాలు కనిపించడంతో పాటు మలవిసర్జన కారణంగా దుర్వాసన వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా పాఠశాలకు ఎదురుగా ఉన్న మురుగునీటి కాలువల కారణంగా దుర్వాసన వెదజల్లుతోందని చెబుతున్నారు. పరిసరాల అపరిశుభ్రత కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## నీటిలో వినాయకుడు

సంతబొమ్మాళి, సెప్టెంబర్ 21 (వార్త):వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా నౌపడ గ్రామంలోని ఇందిరా కాలనీ యువకులు తమ భక్తిని వినూత్న రీతిలో చాటుకున్నారు. ప్రతి ఏడాది ఏదో ఒక ప్రత్యేకతను ఆవిష్కరిస్తూ భక్తులను ఆకట్టుకునే ఇందిరా కాలనీ యువత ఈసారి ప్రత్యేక దీపారాధనతో అందరి దృష్టిని ఆకర్షించారు. మండపంలో కొలువుదీరిన గణేశుడి చిత్రంతో పాటు పరమశివుడి చిత్రాన్ని అందంగా ముద్రించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కాణిపాకం వరసిద్ధి వినాయకుడు నూనెలో కొలువుదీరిన భావనను స్ఫూర్తిగా తీసుకుని, ఇటుకలతో ప్రత్యేకంగా ఒక కొలను ఆకారాన్ని నిర్మించారు. అందులో ఫ్లెక్సీలను అమర్చి అడుగున్నరకు పైగా నీటిని నింపడంతో.. నీటిలో విఘ్నేశ్వరుడు కొలువుదీరినట్లుగా అద్భుతమైన రూపాన్ని సంతరించుకుంది. నీటిలో కొలువుదీరిన శివుడు, గణేశుడి చిత్రాల ముందు పెద్ద సంఖ్యలో దీపాలను వెలిగించి ప్రత్యేక దీపారాధన చేశారు. దీపాల కాంతిలో నీటిపై ప్రతిబింబించిన విఘ్నేశ్వరుడి రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



## మడపాం టోల్ ప్లాజా వద్ద రెండు లారీలు దగ్ధం

* వంశధార నది వంతెనపై అర్ధరాత్రి జరిగిన ప్రమాదం
* ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు
* తృటిలో తప్పిన ప్రమాదం
* లారీలో తరలిస్తున్న సెల్‌ఫోన్లు దగ్ధం



నరసన్నపేట, సెప్టెంబర్21(వార్త): నరసన్నపేట మండలం మడపాం టోల్ ప్లాజా సమీపంలోని వంశధార నది వంతెనపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు లారీలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీల్లోని వ్యక్తులు అప్రమత్తమై బయటకు రావడంతో ప్రాణనష్టం తప్పింది. పోలీసుల వివరాల ప్రకారం.. ముందుగా వెళ్తున్న లారీ వంశధార నది వంతెనపై బ్రేక్‌డౌన్ కావడంతో మరమ్మతుల కోసం రోడ్డు పక్కన నిలిపారు. డ్రైవర్ లారీ నుంచి దిగి మరమ్మతులు పరిశీలిస్తున్న సమయంలో శ్రీకాకుళం వైపు నుంచి నరసన్నపేట వైపు వెళ్తున్న కంటైనర్ అదుపుతప్పి నిలిపి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి రెండు వాహనాలకు వ్యాపించాయి. ప్రమాదంలో రోడ్డు పక్కన నిలిపిన లారీ డ్రైవర్‌తో పాటు కంటైనర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో మంటలు వేగంగా వ్యాపించడంతో లారీల్లో ఉన్న వారు అప్రమత్తమై బయటకు రావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ప్రమాదానికి కారణమైన కంటైనర్‌లో సోమవారం ఉదయం మళ్లీ మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. రాత్రి సమయంలో మంటలు పూర్తిగా ఆరిపోకపోవడంతోనే తిరిగి మంటలు వ్యాపించి ఉండవచ్చని స్థానికులు తెలిపారు. కంటైనర్‌లో పెద్ద సంఖ్యలో తరలిస్తున్న సెల్‌ఫోన్లు మంటల్లో పూర్తిగా కాలిపోయినట్లు తెలిసింది. దీంతో భారీగా ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. అయితే నష్టం విలువ ఎంత అన్నది అధికారికంగా తెలియాల్సి ఉంది. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# శ్రీకాకుళాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలి

**-57 శాతం వర్షపాతం లోటు..**
**-ఎండిపోతున్న పంటలు**
**-రైతు రుణాలు మాఫీ చేసి..**
**కొత్త రుణాలు ఇవ్వాలి**
**-రైతు సంఘం ఆధ్వర్యంలో పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా**




**పలాస, సెప్టెంబరు 21 (వార్త):** వర్షాభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోతున్న శ్రీకాకుళం జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో సాధారణం కంటే భారీగా వర్షపాతం లోటు నమోదవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. 57 శాతం వర్షపాతం లోటుతో ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు జిల్లాలో కురవాల్సిన సగటు వర్షపాతం కంటే 57 శాతం పైబడి లోటు ఉన్నట్లు రైతు సంఘం నాయకులు తెలిపారు. దీంతో వర్షాధారంగా సాగు చేస్తున్న రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారిందన్నారు. ఇప్పటికే పెట్టుబడులు పెట్టి వరి మాగాణుల్లో వెదలు విత్తడంతో పాటు ఇతర పంటలు సాగు చేసిన రైతులకు వర్షాలు లేక తీవ్ర నష్టం వాటిల్లుతోందని తెలిపారు. వర్షాభావం కారణంగా పంటలు ఎండిపోతున్నాయని, ప్రస్తుత పరిస్థితుల్లో పంట చేతికి వచ్చే అవకాశాలు కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాగు కోసం చేసిన పెట్టుబడులు తిరిగి రాకపోవడంతో అప్పుల భారం మరింత పెరిగే ప్రమాదం ఉందని రైతు సంఘం నాయకులు అన్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తెప్పల అజయ్‌కుమార్ మాట్లాడుతూ వంశధార, ఉప్పార (ఉప్పోర్) రిజర్వాయర్ వంటి సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాకపోవడం వల్ల వర్షాభావ సమయంలో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, జిల్లాలో సాగునీటి వనరులను విస్తరించి, పెండింగ్ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వర్షాలు లేక పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో రైతులపై రుణభారం పెరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రుణాలను మాఫీ చేయడంతో పాటు కొత్త రుణాలను మంజూరు చేయాలని కోరారు. పంటలు నష్టపోయిన రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు స్వల్పకాలిక విత్తనాలను ఉచితంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టాలని రైతు సంఘం నాయకులు కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్న నేపథ్యంలో జి.రాంజీ ఉపాధి పథకం కింద 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వర్షాభావం వల్ల పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో అంచనా వేసి, అర్హులైన రైతులకు తగిన పరిహారం అందించాలని కోరారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన కూలీలు, చిన్న, సన్నకారు రైతుల జీవనోపాధిపై కూడా కరువు ప్రభావం పడే అవకాశం ఉన్నందున ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ధర్నాలో ఏపీ రైతు సంఘం వజ్రపుకొత్తూరు మండల అధ్యక్షుడు కే. బాలాజీ, కార్యదర్శి టి. భాస్కర్‌రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దుబ్బ బానమ్మ భాస్కర్, యంపల్ల కామేశ్వరరావు, కే. హేమసూధన, బత్తిని ప్రసాదరావు, టి. రాజు, బి. దుర్యోధన, సీటు గణపతి, అర్లీ దానేషు, జుత్తు సోమేశు తదితరులు పాల్గొన్నారు.

## కాలువ మరమ్మతులు చేయించండి



**పాతపట్నం, సెప్టెంబరు 21(వార్త):** పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని శివశంకర్ కాలనీ ఒకటో వీధి వద్ద డ్రైనేజీ మరియు రహదారి పరిస్థితి తీవ్రంగా క్షీణించిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువపై ఉన్న సిమెంట్ స్లాబ్‌లు (మూతలు) విరిగిపోయి, రహదారి ధ్వంసమై ప్రమాదకరంగా మారిందని, దీనితో పాటు డ్రైనేజీ నీరు సరిగ్గా పారక నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లు తోందని వాపోయారు. వీధి ప్రవేశ మార్గం వద్ద రంధ్రాలు ఏర్పడి, స్లాబ్ విరిగిపోవడంతో కాలనీవాసులు, బాటసారులు, ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ప్రమాదవశాత్తు ఎవరైనా ఈ గుంతల్లో పడిపోతారేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై శివశంకర్ కాలనీ ఒకటవ వీధి నివాసితులు మాట్లాడుతూ పంచాయతీ అధికారులు స్పందించి, వెంటనే ఈ ధ్వంసమైన డ్రైనేజీ స్లాబ్‌ను బాగు చేసి, రహదారిని పునర్ని ర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇకనైనా అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## ప్రైవేటు పాఠశాలల అధ్యక్షునిగా సోమేశ్వరరావు



**పాతపట్నం, సెప్టెంబరు 21(వార్త):** పాతపట్నం నియోజకవర్గ ప్రైవేటు పాఠశాలల నూతన కార్యవర్గ ఎన్నిక శంకర నారాయణ, ప్రతాప్ ఆధ్వర్యంలో స్థానిక అమర జ్యోతి పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ ఎన్నికలో నూతన అధ్యక్షునిగా యం సోమేశ్వరరావు, ముఖ్య కార్యదర్శిగా డి గంగాధర్, కోశాధికారిగా నారాయణ రెడ్డి మరియు ఉపాధ్యక్షునిగా ప్రసాదరావు, ఉప కార్యదర్శిగా డి సుజాత ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షునిగా శంకర నారాయణ మరియు ప్రధాన సలహాదారునిగా జే జే యెస్ ప్రతాప్ ని సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూతన కార్యవర్గం రాబోయే రెండేళ్లకు పనిచేస్తుందని శంకర నారాయణ తెలిపారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలియజేశారు.

## అన్నసంతర్పణకు రూ.10,116ల విరాళం



**పాతపట్నం, సెప్టెంబరు 21(వార్త):** పాతపట్నంలోని నాగవంశపు వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడిని అన్నసంతర్పణకు సీనియర్ నాయకులు నల్లి రాజారావు, సుజాత దంపతులు సోమవారం 10,116 రూపాయలు విరాళంగా అందించారు. అనంతరం స్వామివారికి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దైవకార్యాల్లో అన్నసంతర్పణ ఎంతో పుణ్యప్రదమైనదని, గణనాథుని ఉత్సవాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఈ సందర్భంగా రాజారావు పేర్కొన్నారు. విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

## బూరగాంలో మహిళా డెయిరీకి చర్యలు



**పాతపట్నం, సెప్టెంబరు 21(వార్త):** కొరసవాడ పశు చికిత్సాలయం పరిధిలోగల బూరగాం గ్రామంలో మహిళా డైరీ సహకార సంఘం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్టు పశు వైద్యాధికారి అనిల్ తెలియజేశారు. సోమవారం బూరగాం సచివాలయములో మహిళా పాడి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి, సంఘం ఏర్పాటు విధి విధానాలు, ప్రయోజనాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎండిఎస్ఎస్ నోడల్ అధికారి డాక్టర్ సుగంధం ఓంకార్ పాడిరంగం అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్నటువంటి చర్యలను వివరించారు. సహకార సంఘం ఏర్పాటుకు ప్రతి మహిళా పాడి రైతు సహకరించాలని వారు కోరారు.

## వినాయకుని ఆశీస్సులతో అందరికీ మేలు జరగాలి

**కంచిలి, సెప్టెంబరు 21 (వార్త):** వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరికీ మేలు జరగాలని స్థానిక జడ్పిటిసి సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి ఆకాంక్షించారు. ఆమె సోమవారం మాజీ ఎంపీపీ ఇప్పిలి కృష్ణారావుతో కలిసి జలంత్రకోట, కంచిలి తహసిల్దార్ కార్యాలయం, ఎస్ఆర్సిపురం గ్రామాల్లో గణేష్ మండపాలను సందర్శించారు. ఆయాచోట్ల పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జలంత్రకోట గ్రామంలో కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో విజేతలకు 7000 రూపాయల బహుమతి ని విరాళంగా అందజేశారు.



# అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం



**మందస, సెప్టెంబరు 21(వార్త):** అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తోందని, మన అంగన్‌వాడీ.. మన బాధ్యతని ఐసీడీఎస్ మందస ప్రాజెక్టు సీడీపీఓ పెద్దింటి అరుణ అన్నారు. మందస మండలంలోని భేతాళపురం అంగన్ వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీడీపీఓ అరుణ మాట్లాడుతూ 9వ జాతీయ పోషణ మసోత్సవం కార్యక్రమం సెప్టెంబర్ 9వ తేది నుండి అక్టోబర్ 8వరకు జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా మందస మండలంలోని భేతాలపురం అంగన్ వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవ వేడుకలు ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతీ సంవత్సరం సెప్టెంబర్‌లో జరుపుకునే రాష్ట్రీయ పోషణ మాహ్, పిల్లల పోషణ, మాతృ ఆరోగ్యం, బాల్యదశ అభివృద్ధిపై అవగాహన పెంచడానికి దేశవ్యాప్తంగా చేపట్టే ఒక కార్యక్రమమని పేర్కొన్నారు. 2026 సెప్టెంబర్‌లో జరుపుకున్న 9వ జాతీయ పోషణ మాసోత్సవ ముఖ్య ఉద్దేశ్యమని, మన అంగన్ వాడీ-మన బాధ్యతని చెప్పారు. పోషణ మాహ్ ఐదు ప్రాధాన్యతలపై ఆధారపడి ఉంటుందని, ఆహార వైవిధ్యం, తగినంత ప్రోటీన్ తీసుకోవడాన్ని ప్రోత్సహించడం, తాజా, విభిన్నమైన వేడి వండిన భోజనాన్ని ప్రోత్సహించడం, అంగన్ వాడీ నిర్వహణ కమిటీల ద్వారా సమాజ భాగస్వామ్యం, యాజమాన్యాన్ని బలోపేతం చేయడమేనన్నారు. పోషణను అభిజ్ఞా వికాసం, బాల్యదశ సంరక్షణ, విద్యతో అనుసంధానించడం, భారతదేశ ప్రసూతి ప్రయోజన కార్యక్రమమైన ప్రధానమంత్రి మాతృ వందన యోజన అని చెప్పారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు జె.లక్ష్మి, అంగన్ వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బాల..బాలికలకు స్వీయ రక్షణ అవసరం



**పోలాకి, సెప్టెంబరు 21 (వార్త):** బాలబాలికలు తమను తాము రక్షించుకునే విధానాలపై అవగాహన కలిగి ఉండాలని టెక్కలి డివిజన్ శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ గిరిధర్ సూచించారు. పోలాకి మండలం ఈదులవలసలోని ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసుల సహాయం పొందాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రత కోసం అందుబాటులో ఉన్న పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లను విద్యార్థులకు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత నంబర్లకు సమాచారం అందించి పోలీసుల సహకారం పొందే విధానాన్ని వివరించారు. అదేవిధంగా ప్రస్తుత కాలంలో పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులు, సందేశాలు, ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని, వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ వంటి సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. విద్యార్థుల్లో భద్రతపై అవగాహన పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని శక్తి టీం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో శక్తి టీం సభ్యులతో పాటు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# వెంకటాపురం, ద్వారకపురం ఆలయాలకు..
# టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ రూ.60 లక్షల మంజూరు

**- ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు ధన్యవాదాలు తెలిపిన గ్రామ ప్రజలు**



**పాతపట్నం, సెప్టెంబరు 21(వార్త):** పాతపట్నం మండల పరిధిలోని వెంకటాపురం, ద్వారకపురం గ్రామాలలో నూతనంగా నిర్మించనున్న శ్రీశ్రీశ్రీ ఉదికల పోలమ్మతల్లి, శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయాల నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రత్యేక చొరవతో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఈ నిధులను మంజూరు చేయించారు. గ్రామాల్లో నూతన ఆలయాల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు కావడం పట్ల స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి, గ్రామాల సమగ్ర అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కూడా నిరంతరం సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి, ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే టీటీడీ శ్రీవాణి ట్రస్ట్‌కు గ్రామ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## నరసన్నపేటలో 25న 'నమామి-భారతం వందేమాతరం'



**నరసన్నపేట, సెప్టెంబరు 21 (వార్త):** నరసన్నపేట మండల పరిషత్ ఆవరణలో ఈ నెల 25న 'నమామి-భారతం వందేమాతరం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించి సోమవారం నరసన్నపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. భారతదేశ జాతీయ స్ఫూర్తి, దేశభక్తి భావాలను విద్యార్థుల్లో పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పాఠశాల ప్రిన్సిపల్ ఢిల్లీశ్వరరావు కోరారు. విద్యార్థులు సమిష్టిగా పాల్గొనడం ద్వారా జాతీయ సమైక్యత, దేశభక్తి సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చని కమిటీ అధ్యక్షులు నానాజీ గాడ్కె తెలిపారు. అన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు చేపడుతున్నారు.

# లడ్డూకైనా, డీఎస్సీకైనా ఒకే న్యాయం, ఒకే ప్రమాణం కావాలి

**-శ్రీవారి లడ్డూ నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదని వెల్లడి**
**- డీఎస్సీపై సీబీఐ విచారణ జరిపించాలి**
**- వైఎస్సార్సీపీ ఐటీ వింగ్ పలాస అధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్**



**మందస, సెప్టెంబరు 21(వార్త):** లడ్డూకైనా, డీఎస్సీకైనా ఒకే న్యాయం, ఒకే ప్రమాణం కావాలని, శ్రీవారి లడ్డూ నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదని వెల్లడైందని, డీఎస్సీపై సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్సీపీ ఐటీ వింగ్ పలాస అధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం మాట్లాడుతూ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ కు నమస్కరిస్తున్నానన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో గతంలో మీరు, మీ కూటమి నాయకులు వైఎస్సార్సీపీపై చేసిన ఆరోపణలు రాష్ట్ర ప్రజలకు, కోట్లాది మంది శ్రీవారి భక్తులకు తెలిసిందేనన్నారు. ఆ సమయంలో వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిజానిజాలు పూర్తిగా బయటకు రావాలంటే స్వతంత్ర దర్యాప్తు జరగాలని కోరారన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ(ఈడి)దర్యాప్తులో శ్రీవారి లడ్డూ నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదని వెల్లడైందన్నారు. అయితే, ఇక్కడ మా ప్రశ్న ఒక్కటుందని, 2025 మెగా డీఎస్సీ విషయంలో కూడా అదే పారదర్శకత ఎందుకు చూపించకూడదని నిరుద్యోగులు తరుపున మంత్రి లోకేష్ కు ప్రశ్నిస్తున్నామన్నారు. 2025 మెగా డీఎస్సీ నియామకాల్లో, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా ఎంపికలపై నిరుద్యోగ అభ్యర్థులు అనేక ఆరోపణలు, అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. జూడో సర్టిఫికెట్ల ప్రామాణికతపై విజిలెన్స్ విచారణ జరుగుతోందని ప్రభుత్వం కూడా వెల్లడించిందన్నారు. అందుకే మా డిమాండ్ స్పష్టంగా ఉందని, 2025 మెగా డీఎస్సీపై సమగ్ర సీబీఐ విచారణకు ఆదేశించాలని, స్పోర్ట్స్ కోటాలో జరిగిన నియామకాలను పూర్తిస్థాయిలో పునఃపరిశీలించాలని, స్పోర్ట్స్ సర్టిఫికెట్లు, టెట్ అర్హతలు, కేటగిరీ సర్టిఫికెట్లను స్వతంత్రంగా ధృవీకరించాలని, అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క నిరుద్యోగ అభ్యర్థికి కూడా అన్యాయం జరగకుండా న్యాయం చేయాలని, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా 2025 డీఎస్సీపై సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారన్నారు. లడ్డూ విషయంలో నిజాలు బయటకు రావాలని కోరినట్లే, డీఎస్సీ విషయంలో కూడా నిజాలు బయటకు రావాలని కోరుతున్నామన్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్తు విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా సీబీఐ విచారణకు ఆదేశించాలని, శ్రీవారి లడ్డూ విషయంలో జంతు కొవ్వు ఉందనే ఆరోపణలతో కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్న నేపథ్యంలో అప్పటి వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజలకు సమగ్ర వివరణ ఇవ్వాలని బత్తిని లక్ష్మణ్ కోరారు.

## విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ తప్పనిసరిగా చేయించాలి



**నరసన్నపేట, సెప్టెంబరు 21 (వార్త):** ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు తప్పనిసరిగా ఆధార్ వివరాలను అప్డేట్ చేసుకోవాలని ఎంఈఓ ఉప్పాడ శాంతారావు సూచించారు. విద్యార్థుల ఆధార్ వివరాలు సక్రమంగా ఉండటం వల్ల పాఠశాలల పరిధిలో వివిధ విద్యా కార్యక్రమాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన ప్రక్రియలు సులభతరం అవుతాయని తెలిపారు. నరసన్నపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంఈఓ శాంతారావు పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఆధార్ అప్డేషన్ ప్రక్రియను పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. మండలంలోని విద్యార్థుల ఆధార్ వివరాల అప్డేషన్‌ను పూర్తి చేసేందుకు మొత్తం ఐదు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ తెలిపారు. మండలంలో ఇంకా సుమారు 2,229 ఆధార్ కార్డుల అప్డేషన్ పూర్తి చేయాల్సి ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల ఆధార్ వివరాల్లో మార్పులు, అవసరమైన అప్డేషన్ ఉంటే సంబంధిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆధార్ అప్డేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించి, నిర్ణీత ప్రక్రియను త్వరగా పూర్తి చేయడానికి పాఠశాలలు, అధికారులకు సహకరించాలని ఎంఈఓ కోరారు.

## హిందీ ఉపాధ్యాయులకు సన్మానం

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 21 (వార్త):** హిందీ దివస్ వారోత్సవాలు లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. హేమకుమారి ఆధ్వర్యంలో పాఠశాల హిందీ ఉపాధ్యాయులు సిహెచ్ వెంకటరమణ, డి.పద్మావతికి ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు ఎస్సే రైటింగ్, డ్రాయింగ్, క్విజ్, హిందీ దేశభక్తి గేయాలు మొదలగు పోటీలో నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వై కమలాకర్ రావు, శ్రీహరి, కృష్ణారావు, గోవిందరావు శంకర్ రెడ్డి, నూకయ్య, సువర్ణ, శేషశ్రీ, ఈశ్వరరావు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## జ్ఞానభారతి స్కూల్‌లో గురజాడ జయంతి వేడుకలు

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 21 (వార్త):** స్థానిక జ్ఞాన భారతి పాఠశాలలో గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమాన్ని పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్యనిర్వాహణ అధికారి జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా గురజాడ అప్పారావు చిత్రపటానికి జోహార్ ఖాన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి పండా, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# వంశ'ధార'ను ఇచ్ఛాపురం వరకు అందించాలి

- రైతులను ఆదుకోవాలి
- కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడు స్పందించాలి
- వంశధార సాగు జల సాధన

### పలాస కమిటీ వినతి

**మందస, సెప్టెంబరు 21(వార్త):** వంశ'ధార'ను ఇచ్ఛాపురం వరకు అందించి, రైతులను ఆదుకోవాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడును వంశధార సాగు జల సాధన పలాస కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు కేంద్ర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు వంశధార సాగు జల సాధన కమిటీ పలాస డివిజన్ కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం జిల్లాలో వెనుకబడిన ప్రాంతాలైన ఇచ్ఛాపురం పలాస నియోజకవర్గాల రైతులు పంటలు పండించుటకు నీరు లేక భూములు వదులుకోలేక నానా అవస్థలు పడి వ్యవసాయం చేస్తూ అప్పుల పాలవుతున్నారన్నారు. భూములు వదిలి వలస కూలీలుగా జీవనం గడుపుతున్నారన్నారని, 1962 సంవత్సరంలో శ్రీకాకుళం జిల్లా సస్యశ్యామలం చేయటానికి వంశధార ప్రాజెక్టు శంకుస్థాపన చేయడం జరిగిందని, ఆనాడు ఇచ్ఛాపురం నియోజకవర్గం వరకు సాగునీరు అందించాలని ఉద్దేశంతో ప్రతిపాదించడమైనదన్నారు. కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక నేరేడు బ్యారేజ్ సమస్యకు పరిష్కార మార్గం కనుగొన్నందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అదే స్ఫూర్తితో పనులు ప్రారంభం చేసి నేరేడు ప్రాజెక్టు ఒరిస్సా సరిహద్దు సమస్యపై మన రాష్ట్ర ప్రభుత్వం త్వరగా ఈ సమస్యపై స్పందించి, ఇచ్ఛాపురం వరకు కాలువను పొడిగించి పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గం సస్యశ్యామలం చేయాలని కోరారు. తక్కువ వ్యయంతో బొడ్డుపాడు వేపాడు చెరువు, జంతి బంద, దామోదరసాగరం, సునాముది అనుసంధానం చేయగలిగితే పలాసలో 6, మందసలో 20, సోంపేట 5 మండలాలు కలిపి, మొత్తం 21పంచాయతీల రైతులుకు తక్కువ ఖర్చుతో సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వంశధార సాగుజాల సాధన కమిటీ పలాస డివిజన్ అధ్యక్షుడు మార్పు మన్మధరావు, ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకటరావు, నల్ల హడ్డి, మజ్జి బాబురావు, వాయిలపల్లి వరప్రసాద్, పెద్దింటి శశిధర్ వర్మ, వాయలపల్లి మాధవరావు, దేవాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు పీఎంశ్రీ పాఠశాల విద్యార్థులు



**నరసన్నపేట, సెప్టెంబరు 21 (వార్త):** నరసన్నపేట పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రీడా రంగంలో ప్రతిభ చాటారు. ఇటీవల శ్రీకాకుళంలోని కోడి రామమూర్తి స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూపవతి తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించడం పాఠశాలకు గర్వకారణమని ఆమె పేర్కొన్నారు. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఎంపికైన విద్యార్థులను సోమవారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. వారి భవిష్యత్ క్రీడా ప్రస్థానం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

## టికెట్ అడిగిన మహిళా టీసీపై దాడి

- పలాస రైల్వే స్టేషన్‌లో కలకలం..
- ప్రయాణికుడిని రైల్వే పోలీసులకు అప్పగించిన స్థానికులు





**పలాస, సెప్టెంబరు 21 (వార్త):** టికెట్ చూపించాలని అడిగినందుకు విధుల్లో ఉన్న మహిళా టికెట్ కలెక్టర్ (టీసీ)పై ఓ ప్రయాణికుడు దాడికి పాల్పడిన ఘటన పలాస రైల్వే స్టేషన్‌లో సోమవారం కలకలం రేపింది. ప్రయాణికుల మధ్య చోటుచేసుకున్న ఈ ఘటనతో స్టేషన్ ప్రాంగణంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానికుల సమాచారం మేరకు.. పలాస రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా టీసీ సుజాత ప్రయాణికుల టికెట్లను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రయాణికుడిని టికెట్ చూపించాలని కోరారు. దీనిపై ఆగ్రహించిన సదరు ప్రయాణికుడు టీసీతో వాగ్వాదానికి దిగి, అనంతరం ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఘటనను గమనించిన స్థానికులు, తోటి ప్రయాణికులు వెంటనే స్పందించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని రైల్వే పోలీసులకు అప్పగించారు. ఘటనపై రైల్వే పోలీసులు వివరాలు సేకరించి విచారణ జరిపి తక్షణమే విదిలో ఉన్న టికెట్ కలెక్టర్ ఫై చేయి చేసుకున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

### విధుల్లో సిబ్బందికి రక్షణ ఏది?

రైల్వే స్టేషన్లలో టికెట్ల తనిఖీ, ప్రయాణికులకు నిబంధనలు తెలియజేయడం వంటి విధులు నిర్వహించే సిబ్బందిపై దాడులకు పాల్పడటం ఆందోళన కలిగించే పరిణామంగా మారుతోంది. ప్రయాణికులు నిబంధనలను పాటిస్తూ సిబ్బందితో సహకరించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో విధుల్లో ఉన్న సిబ్బందికి భద్రత కల్పించేందుకు రైల్వే శాఖ మరింత అప్రమత్తంగా ఉండాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మహిళా టీసీపై దాడికి సంబంధించిన పూర్తి వివరాలు, ఘటనక దారితీసిన పరిస్థితులు, నిందితుడిపై తీసుకునే చర్యలపై రైల్వే పోలీసుల దర్యాప్తులో తెలుస్తుందని రైల్వే పోలీసులు తెలిపారు.

## రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు తేజస్విని ఎంపిక

- జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం.. కాశీబుగ్గ హైస్కూల్‌కు ఘనత

**పలాస, సెప్టెంబరు 21 (వార్త):** శాస్త్రీయ ఆలోచనా విధానం, పరిశోధనాత్మక దృక్పథం పెంపొందించేలా నిర్వహించిన జాతీయ సైన్స్ సెమినార్‌లో కాశీబుగ్గ హైస్కూల్ విద్యార్థిని పి. తేజస్విని సత్తా చాటింది. శ్రీకాకుళంలోని జిల్లా హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఆమె ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. 'భారతదేశ శక్తి పాత్ర--2047' అనే అంశంపై జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. జిల్లాలోని 30 మండలాల నుంచి మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులతో తలపడి తేజస్విని ప్రథమ స్థానాన్ని సాధించడంతో పలువురు అభినందించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన తేజస్వినికి డీఈఓ రవికుమార్ ప్రథమ బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో కాశీబుగ్గ హైస్కూల్‌లో ఆనందం వ్యక్తపరిచారు. తేజస్వినికి గైడ్ టీచర్‌గా పాఠశాల ఉపాధ్యాయుడు కొల్లి వెంకటరావు మార్గనిర్దేశం చేశారు. రాష్ట్రస్థాయిలో జరగనున్న సైన్స్ సెమినార్‌లో తేజస్విని పాల్గొననుంది. అక్కడ కూడా ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. తేజస్విని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై పాఠశాల హెచ్ఎం చిన్నమనాయుడు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ విజయకుమారి, వివిధ మండలాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## సరుబుజ్జిలిలో నాలుగు రోడ్లు, ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



**సరుబుజ్జిలి, సెప్టెంబరు 21 (వార్త):** ఆమదాలవలస నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. అలికాం-బత్తిలి, జగన్నాధపురం-సరుబుజ్జిలి మార్గాల్లో రూ.13.46 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులను అతి తక్కువ కాలంలో పూర్తి చేసి ప్రారంభించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని రహదారిని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహాన్ని కింజరాపు రామ్మోహన్ నాయుడు, కూన రవికుమార్ కలిసి ఆవిష్కరించారు. ఎన్టీఆర్ సేవలను, ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా వారు స్మరించుకున్నారు. నాలుగు లైన్ల రహదారి అందుబాటులోకి రావడంతో సరుబుజ్జిలీ మండలంలో పలు గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మరింతమెరుగుపడనుంది. ప్రయాణ సమయం తగ్గడంతో పాటు వాహనాల రాకపోకలకు సౌలభ్యం కలగనుంది. వాణిజ్య, వ్యవసాయ కార్యకలాపాలకు కూడా ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నియోజకవర్గంలో రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, విద్య, వైద్యం తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పనులు చేపడుతున్నామని కార్యక్రమంలో ఎమ్మెల్యేపేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తుపాను ముప్పు.. పునరావాస కేంద్రాల పరిశీలన



**పలాస, సెప్టెంబరు 21 (వార్త):** తుపాను ప్రభావం నేపథ్యంలో తీరప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తినా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని పలాస రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) ఆర్.అప్పలరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం వజ్రపుకొత్తూరు మండలంలోని తుపాను పునరావాస కేంద్రాలు, సైక్లోన్ షెల్టర్ సెంటర్లను ఆయన పరిశీలించారు. హుకుంపేట, పుడిలంక, మంచినీళ్లపేట, నువ్వలరేవు గ్రామాల్లో పర్యటించి తుపాను పరిస్థితులను సమీక్షించారు. తీర ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులను నిరంతరం గమనిస్తూ, ఎక్కడైనా ముప్పు పొంచి ఉంటే వెంటనే స్పందించేలా క్షేత్రస్థాయి యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయడంతో పాటు అవసరాన్ని బట్టి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రవాణా, పునరావాస ఏర్పాట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. సైక్లోన్ పునరావాస కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, అత్యవసర మందులు తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఆశ్రయం పొందే కేంద్రాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందుగానే తనిఖీలు పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లను కూడా పరిశీలించాలని తెలిపారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు అని, తుపాను ప్రభావం నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా అవగాహన కల్పించాలని ఆర్డీవో సూచించారు. ఇప్పటికే సముద్రంలో ఉన్న మత్స్యకారులకు సమాచారం చేరేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. తీరప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రమాద సూచనలు కనిపించిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు వాతావరణ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని, అధికారులు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని ఆర్డీఓ ఆర్.అప్పలరాజు కోరారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో వజ్రపుకొత్తూరు తహసీల్దార్, ఎంపీడీఓ, డీడీ ఫిషరీస్, ఎంఈఓ తదితర అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సమరానికి టీడీపీ సన్నద్ధం

- అభ్యర్థి ఎవరైనా గెలుపే లక్ష్యం..
- కూటమి శ్రేణులు ఐక్యంగా పనిచేయాలి
- కార్యకర్తల కష్టానికి తగిన గుర్తింపు
- పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు నజీర్




**పలాస, సెప్టెంబరు 21 (వార్త):** రాబోయే పలాస--కాశీబుగ్గ మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పలాస నియోజకవర్గ టీడీపీ ఎన్నికల పరిశీలకుడు, పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు నజీర్ పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పార్టీ తరపున ఎవరు అభ్యర్థిగా బరిలో నిలిచినా వ్యక్తిగత భేదాలకు అతీతంగా సమష్టిగా పనిచేసి గెలిపించడమే ప్రతి కార్యకర్త ముందున్న ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. పలాస టీడీపీ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న ఆశావహులతో నిర్వహించిన సమావేశంలో నజీర్ మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం, అభ్యర్థుల ఎంపిక, క్షేత్రస్థాయి ప్రచారం, కూటమి పక్షాల మధ్య సమన్వయం కీలకంగా మారనున్న నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. వ్యక్తుల కంటే పార్టీ ప్రయోజనమే ముఖ్యమని, పార్టీ తరపున ఎవరికి అవకాశం లభించినా మిగిలిన ఆశావహులు, నాయకులు, కార్యకర్తలు అభ్యర్థి విజయానికి అంకితభావంతో పనిచేయాలని నజీర్ కోరారు. వ్యక్తిగత ప్రయోజనాలు, అంతర్గత విభేదాలకు తావులేకుండా పార్టీ ప్రయోజనానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎన్నికల్లో టికెట్ ఆశించే ప్రతి ఒక్కరి రాజకీయ చురుకుదనం, ప్రజల్లో ఉన్న పరిచయం, క్షేత్రస్థాయి బలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేస్తున్న కార్యకర్తల సేవలను నాయకత్వం గుర్తిస్తుందని, వారి కష్టానికి తగిన గౌరవం, గుర్తింపు లభిస్తుందని భరోసా ఇచ్చారు. కూటమి ఐక్యతపైనే దృష్టి పెట్టాలని, మున్సిపల్ ఎన్నికల్లో కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయం కీలకమని నజీర్ తెలిపారు. టీడీపీతో పాటు కూటమిలోని అన్ని పక్షాల నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తే ఎన్నికల్లో బలమైన ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. వార్డు స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు సమన్వయంతో ఎన్నికల కార్యాచరణను రూపొందించుకోవాలని సూచించారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీపై ప్రజల తీర్పును ప్రస్తావించిన నజీర్.. అదే విధంగా రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ కూటమి శ్రేణులు ఐక్యంగా పనిచేసి పార్టీకి విజయాన్ని అందించాలని కోరారు. ప్రజా సమస్యలు, పట్టణాభివృద్ధి, మౌలిక వసతులు వంటి అంశాలను ప్రధానంగా తీసుకుని ప్రజల్లోకి వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

## వెంకటరమణ కుటుంబానికి రూ.25వేల సాయం



**మందస, సెప్టెంబరు 21(వార్త):** లొహరిబంద గ్రామానికి చెందిన నర్తు వెంకటరమణ రోడ్డు ప్రమాదంలో మరణించారు. వెంకటరమణ పేద కుటుంబం కావడంతో దాతలు ఆర్థిక సాయం చేస్తున్నారు. మృతునికి తల్లి, భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. భార్య రోజా హృదయ సంబంధ సమస్యలతో బాధపడుతూ ఉంది. ఇద్దరు చిన్నపిల్లల వయస్సు నాలుగు సంవత్సరాల్లోపు ఉంది. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు వెంకటరమణ ఇంటికి చేరుకుని, రూ.25000రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబ దీన పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, స్వచ్ఛంద సంస్థలు ఉదారతతో ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ కలాం ఫౌండేషన్ ప్రతినిథులు నర్తు కుమారస్వామి, కరగాన కుమార్, సిసింద్రి, నర్తు సోమేశ్వరరావు, కొరికాన సాయి, కోట జయక్రిష్ణ, ఎన్.జగ్గారావు, దుద్ది శరత్ బాబు, ఎం.రవి, గేదెల జానకిరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం ఫౌండేషన్ చేస్తున్న సేవలను గ్రామస్తులు అందరూ కొనియాడారు.

## విద్యార్థులకు హెచ్ఐవీపై అవగాహన



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 21 (వార్త):** పురుషోత్తపురం ఏపీ మోడల్ స్కూల్ లో గెస్ట్ టి ఐ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఇంట్రన్స్ ఫైడ్ ఐఇసి ప్రోగ్రాం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ కుమారస్వామి రెడ్డి మాట్లాడుతూ హెచ్ఐవి ఎలా వస్తుందని ఎలా రాదని మనకు వివరించడానికి శ్రీకాకుళం ఎయిడ్స్ నియంత్రణ మండలీ నుండి మనకు విచ్చేశారని చెప్పే విషయాలన్నీ శ్రద్ధగా వినాలని వివరించారు. ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రి ఐ సి టి సి కౌన్సిలర్ బి .రాజశేఖర్ మాట్లాడుతూ హెచ్ఐవి వంటి వ్యాధి కాదని అంటించుకునే వ్యాధిని హెచ్ఐవి ఎలా వస్తుందని ఎలా రాదని వివరించారు . ఈ కార్యక్రమంలో మరో వక్త నిర్వాహకుడు నిరంజన్ మాట్లాడుతూ హెచ్ఐవి దశలో నిర్లక్ష్యం నిర్లక్ష్యం వహించడం వలన ఎయిట్ స్టేజ్ కి వెళ్లే ప్రమాదం పొంచి ఉందని అన్నారు. ప్రాథమికంగా గుర్తిస్తే ఆర్ట్ మందులు వాడడం వల్ల వెయిట్ చేసి వెళ్లకుండా మరణాన్ని ఆపవచ్చని ఆర్ట్ మందులు ఉచితంగా లభిస్తాయని తద్వారా ఎయిడ్స్ స్టేజ్ కి వెళ్ళకుండా నిలువరిస్తుంద ని జీవన ప్రమాణం పెంపొందిస్తుందని చెప్పారు. ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే 1097 ఆయన టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయాలని చెప్పారు. అలాగే చదువుతున్న అమ్మాయిలు ఉద్దేశించి మాట్లాడుతూ ఎస్ టి ఐ లక్షణాల్లో ప్రధానంగా పరిశుభ్రత పాటించాలని లేదంటే పొత్తి కడుపునొప్పి చెడు వాసన తెల్లబట్ట అవడం ఇవన్నీ సంభవించే అవకాశం ఉందని తద్వారా సర్వైకల్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు లెక్చరర్లు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 21 (వార్త):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సనపల అన్నాజీ రావు పిలుపునిచ్చారు. సోమవారం ఇచ్ఛాపురం పట్టణంలో ఇచ్ఛాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. త్వరలో జరగనున్న ఇచ్ఛాపురం మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ విజయకేతనం ఎగురవేయాలని కోరారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే ధ్యేయంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఆదేశాలతో 28 మందితో నూతన జిల్లా కార్యవర్గం ఏర్పాటయిందని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శిగా నియమితులైన ఇచ్ఛాపురం నియోజకవర్గ నాయకులు అలీమ్ ఖాన్, పూడి కిరణ్ కుమార్ లను ఘనంగా సన్మానించారు. పార్టీ ఇచ్ఛాపురం మండల అధ్యక్షునిగా కె పాపారావు, కవిటి మండల అధ్యక్షునిగా పరపాన మధు, కంచిలి మండల అధ్యక్షునిగా ఎం. తులసీదాస్, సోంపేట మండల అధ్యక్షునిగా శ్యాం ప్రసాద్ రెడ్డి లను నియమించారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ మసపత్రి చక్రవర్తి , జిల్లా కిసాన్ విభాగం అధ్యక్షులు కే మధుసూదన్ రావు ఇతర నాయకులు హాజరయ్యారు.

## జీఎస్ ఫౌండేషన్ సభ్యులకు అవార్డులు

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 21 (వార్త):** "భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్" ఆధ్వర్యంలో "ఉత్తమ సేవా పురుస్కారం - 2026" అవార్డులు తెలంగాణ, భువనగిరి జిల్లా, యాదాద్రి, ఆత్మకూరు టౌన్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇచ్ఛాపురం జి ఎస్ ఫౌండేషన్ సభ్యులు అనపాన శ్రీరామ్ రెడ్డి, పాతిర్ల గిరి బాబు రెడ్డి లకు ఆహ్వానం పలికారు. గౌతమ్ (హెల్పింగ్ నీడ్స్) మరియు వరల్డ్ రికార్డు బ్లడ్ డోనార్ 336 సార్లు రక్తదానం చేసిన డా : సంపత్ కుమార్ చేతులు మీదిగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు డా. కురుమేసి నవీన్ , ఉపాధ్యక్షులు బాబు మరియు ప్రధాన కార్యదర్శి వేగూరు హేమంత్ పాల్గొన్నారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడేందుకు జి ఎస్ ఫౌండేషన్ ద్వారా రక్తాన్ని అందచేయటం, అనేక రక్తదాన సిబరాలు నిర్వహించడం, అనేక సేవా కార్యక్రమాల్లో సమాజానికి తమ వంతు సహాయాన్ని అందిస్తున్నారు. సేవా దృక్పథం, అంకితభావం, మానవతా విలువలను గుర్తించినందుకు ఈ రెండు అవార్డులతో సత్కరించడం ఆనందంగా ఉందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# తుఫాన్ ముప్పుపై అప్రమత్తం.. అధికార యంత్రాంగం సిద్ధం

**- అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఎమ్మెల్యే గౌతు శిరీష**

**- లోతట్టు, తీరప్రాంతాలపై ప్రత్యేక నిఘా.. విద్యుత్ అంతరాయాల నివారణకు చర్యలు**

**పలాస, సెప్టెంబరు 21 (వార్త):** రానున్న తుఫాన్ నేపథ్యంలో పలాస నియోజకవర్గంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. ముప్పు ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు నియోజకవర్గంలోని మూడు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, విద్యుత్ శాఖ డీఈతో ఎమ్మెల్యే సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా మండలాల్లో తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు చేపట్టిన ముందస్తు ఏర్పాట్లు, అధికారుల సన్నద్ధత, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని ఎమ్మెల్యే కోరారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, తీరప్రాంత గ్రామాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, బలహీనంగా ఉన్న ఇళ్లు, ప్రమాదకర ప్రాంతాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. అవసరమైన సందర్భాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. సహాయక చర్యలకు సన్నద్ధంగా ఉండాలని, తుఫాన్ ప్రభావంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయక చర్యలకు ముందుగానే ఏర్పాట్లు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందనకు కంట్రోల్ రూమ్‌లు, సహాయక బృందాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. వివిధ శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ సమాచార మార్పిడిలో జాప్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. విద్యుత్ శాఖకు అప్రమత్తతగా ఉండి తుఫాన్ సమయంలో విద్యుత్ స్తంభాలు, లైన్లు దెబ్బతినే అవకాశం ఉన్నందున



విద్యుత్ శాఖ ప్రత్యేక అప్రమత్తతతో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, విద్యుత్ లైన్లను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని డీఈని ఆదేశించారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే సిబ్బందిని సిద్ధంగా ఉంచి, పరిస్థితులు అనుకూలించిన వెంటనే సురక్షితంగా పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అధికారులు అందుబాటులో ఉండాలని, కిందిస్థాయి సిబ్బంది నుంచి మండలస్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ పరిస్థితులపై అధికారికంగా వెలువడే సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని ఎమ్మెల్యే సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని, అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలు ముందస్తు హెచ్చరికలను నిర్లక్ష్యం చేయకుండా అధికార యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మందసను కరువు మండలంగా ప్రకటించాలి




**మందస, సెప్టెంబరు 21(వార్త):** మందస మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం మందస మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ బి.శ్రీహరిబాబుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి పి.దేవేంద్ర, మండల అధ్యక్షుడు మట్ట ధర్మరావు, గిరిజన సంఘ నాయకుడు ఎస్.పాల్గుణరావు మాట్లాడుతూ మందస మండలంలో ఈ సమయానికి కురవవలసిన సాధారణ వర్షపాతం 57% తక్కువ పడిందన్నారు. ఇప్పటికే రైతులు వెదలు వేసి సుమారు 75 రోజులు పైబడిందని, వర్షాభావ పరిస్థితుల వలన వేసిన పంటలు ఎదుగుదల లేక పంటలు పండుతాయని గ్యారెంటీ లేదన్నారు. మండలంలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో పూర్తి చేయకపోవడంతోనే మండలంలో కరువుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక కారణమని, తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలన్నారు. ఇప్పటికే రైతులు, కౌలు రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామంలో కూలీలకు ఉపాధి హామీ పనులు ఇవ్వడం లేదని, పనులు లేక వలసలు పోతున్నారని వారన్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉండడం వలన బోరు బావులపై వ్యవసాయం చేసే రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం మందస మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతుల బ్యాంకు రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించి వలసలు నివారించాలని, స్వల్పకాలిక విత్తనాలు ఉచితంగా రైతులకు అందించాలన్నారు. సాగునీటి కాలువలు మరమ్మత్తులు చేసి చివర భూములకు నీరు ఇవ్వాలని, అప్రకటిత విద్యుత్ కోతలు నివారించాలని, కౌలు రైతులకు, దేవాలయ భూసాగుదారులకు సాగు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ తదితర ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ప్రజా ప్రతినిధులు అధికారులు ఇన్సూరెన్స్ చేసుకోమని ప్రచారం చేస్తున్నారని, కరువు మండలంగా గుర్తించకుండా ఇన్సూరెన్స్ చేయడంతో రైతులకు ఏ విధంగా మేలు జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కరువు మండలంగా ప్రకటించి రైతాంగానికి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టొంప అంజి, మద్దిల తిరుపతి, మద్దిల బుడ్డు, సాసుమాన జగ్గారావు, ఎస్.కూర్మారావు ఎస్.నరసింగులు, ఎస్.తిరుపతి, ఎస్.ధనుజయ తదితరులు పాల్గొన్నారు.

## కిసాన్ మోర్చా విజయనగరం జిల్లా ఇన్‌చార్జిగా అన్నెపు ఉమామహేశ్వరరావు

**పాతపట్నం, సెప్టెంబరు 21 (వార్త) :** బిజెపి కిసాన్ మోర్చా విజయనగరం జిల్లా ఇన్చార్జిగా పాతపట్నం మండలం పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, బిజెపి సీనియర్ నాయకులు అన్నెపు ఉమామహేశ్వర రావు నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అధికారిక ప్రకటన ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమామహేశ్వరరావు ప్రస్తుతం బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సుదీర్ఘ కాలంగా బిజెపి పార్టీ అభివృద్ధికి, రైతు సంక్షేమానికి ఆయన అందిస్తున్న విశేష సేవలను గుర్తించి అధిష్టానం ఈ కొత్త బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో కిసాన్ మోర్చ విజయనగరం జిల్లా ఇన్చార్జి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి, రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చిత్తశుద్ధితో పనిచేసి జిల్లాలో పార్టీ బలోపేతానికి, రైతుల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఆయన నియామకంపై బిజెపి శ్రేణులు, పలువురు కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఉమామహేశ్వరరావుకి శుభాకాంక్షలు మరియు అభినందనలు తెలియజేశారు.



## ధన్వంతరి జయంతి వేడుకలు



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 21 (వార్త):** ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి లో ధనవంతరి జయంతి వేడుకల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య విభాగం మరియు ప్రధానమంత్ర నరేంద్ర మోడీ పిలుపుమేరకు ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రి యందు ఆయుర్వేదిక్ వైద్య శిబిరాలు నిర్వహించుటకు యాక్షన్ ప్లాన్ ప్రిపేర్ చేశారు.దీని ప్రధాన ఉద్దేశం ఆయుర్వేదిక మందులు వాడి రోగాల్ని నయం చేసే విధంగా ఉండాలని ప్రభుత్వం సంకల్పంతో ఈ యొక్క కార్యక్రమాన్ని భారతదేశంలో ఉన్నటువంటి ప్రతి సామాజిక ఆసుపత్రి యందు ఇటువంటి కార్యక్రమం చేపట్టాలని నిర్ణయం తీసుకోన్నారు .ఈ కార్యక్రమంలో భాగంగా హాస్పిటల్ సూపరెండెంట్ డాక్టర్ దేవేందర్ రెడ్డి,స్టాఫ్ నర్స్ ఇతర వైద్యులు డాక్టర్ ప్రేమ్ కుమార్ జొన్న మొదలగు సిబ్బంది వైద్య సిబ్బంది ఆయుర్వేదిక్ కాంపౌండర్ అన్నారావు మరియు హాస్పిటల్ సిబ్బంది స్టాఫ్ నర్స్ ఫార్మాసిస్ట్ సత్యనారాయణ వైద్య సిబ్బంది ఎక్సే విభాగం టెక్నీషియన్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## గురజాడ రచనలు స్ఫూర్తిదాయకం

**మెళియాపుట్టి, సెప్టెంబరు 21(వార్త):** సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు రచనలు స్ఫూర్తిదాయకమని జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అనపాన రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా గ్రంథాలయ అధికారిని అనురాగ నేతృత్వంలో స్థానిక శాఖ గ్రంధాలయంలో సోమవారం నాడు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్, సమాజంలోని మూఢనమ్మకాలు, అసమానతలను ప్రశ్నిస్తూ, ప్రజల్లో చైతన్యం నింపిన వారి రచనలు నేటికీ స్ఫూర్తిదాయకమని, తెలుగు సాహిత్యానికి ఆధునిక దిశానిర్దేశం చేసిన మహాకవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు అని ఆయన ఆశయాలను సమాజ అభ్యున్నతికి పాటుపడదాం పలువురు వ్యక్తులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వారితో పాటుగా సర్పంచ్ ప్రతినిధి రేఖాన వాసు, దుక్క శంకర్, హైస్కూల్ ఛైర్మన్ బూరగాన చిన్నబాబు, పాఠకులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## ప్రైవేటు విద్యాసంస్థల్లో సమగ్ర తనిఖీలు చేయాలి

**-గుర్తింపు, అనుమతులు, అఫిలియేషన్.. ఫైర్ సేఫ్టీపైనా పరిశీలించాలి**

**-నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి**

**-ఏఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్**

**పలాస, సెప్టెంబరు 21 (వార్త):** జిల్లాలో శ్రీ చైతన్య, నారాయణ పేర్లతో నిర్వహిస్తున్న పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఇతర ప్రైవేటు విద్యాసంస్థలపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఆయా సంస్థలకు ఉన్న గుర్తింపు, అనుమతులు, అఫిలియేషన్, భవన భద్రత, ఫైర్ సేఫ్టీ, మౌలిక సదుపాయాలను అధికారులు పరిశీలించాలని కోరింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సోమవారం గ్రీవెన్స్‌లో జ్యోతి కుమారికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి. సోమశేఖర్ మాట్లాడుతూ విద్యాసంస్థల నిర్వహణలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. ఒక బ్రాంచ్‌కు అనుమతి తీసుకుని మరికొన్ని ప్రాంతాల్లో అదనపు బ్రాంచ్‌లను నిర్వహిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని అన్నారు. ప్రతి విద్యా సంస్థకు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు, గుర్తింపులు, అఫిలియేషన్ ఉన్నాయా? లేదా? అన్నది పరిశీలించాలని కోరారు. విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాల్లో రాజీ ఉండకూడదని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పాఠశాలలు, కళాశాలలు నిర్వహిస్తున్న భవనాలకు ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు, భవన భద్రతా నిబంధనలు అమలవుతున్నాయా? అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులను సురక్షితంగా బయటకు తరలించే ఏర్పాట్లు ఉన్నాయా? అనే అంశాలపై తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కనీస మౌలిక సదుపాయాలు లేని సంస్థలపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫీజుల వసూళ్లపైనా తనిఖీలు చేపట్టాలని, ప్రైవేటు విద్యాసంస్థల్లో వసూలు చేస్తున్న ఫీజులపైనా అధికారులు దృష్టి సారించాలని సోమశేఖర్ కోరారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఫీజులు వసూలు చేస్తున్నారా? విద్యార్థులు, తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారా? అనే అంశాలపై తనిఖీలు నిర్వహించాలని కోరారు. విద్య పేరుతో అనవసరమైన ఆర్థిక భారాన్ని తల్లిదండ్రులపై మోపకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

రాత్రి వరకు తరగతులా?

'స్పెషల్ క్లాసులు' పేరుతో విద్యార్థులకు నిర్ణీత సమయానికి మించి తరగతులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలపైనా అధికారులు విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. కొన్ని శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థల్లో రాత్రి 7 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారని ఆ రూపంలో వినిపిస్తున్నాయి. దీనిపై తక్షణమే తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల భద్రత, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, ఫీజుల నియంత్రణ వంటి అంశాల్లో అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హర్షవర్ధన్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల్లో సదుపాయాలు కల్పించండి



**కంచిలి, సెప్టెంబరు 21 (వార్త):** కంచిలి మండలంలో ఇంకా వెనుకబడిన గిరిజన గ్రామాలలో సౌకర్యాలు మెరుగుపరచాలని, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సోమవారం సీతంపేట ఐ టీ డి ఏ అధికారులను కంచిలికి చెందిన టిడిపి నాయకులు కలిసి కోరారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ సిఫార్సు లేఖతో కంచిలి టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావుతో పాటు పలువురు నేతలు కలిసి ఐటిడిఏ అధికారులను కలిశారు. కంచిలి మండలం గిరిజన గ్రామాల్లో నూతన సిసి రోడ్లు, కొత్తగా బీటీ రోడ్లు నిర్మించాలని కోరారు. దెబ్బతిన్న రహదారులలో వెంటనే మరమ్మతులు చేయాలని కొత్త రోడ్లు వేయాలని కోరారు. సోంపేట పట్టణానికి గిరిజన గ్రామాల నుంచి రాకపోకలు సులభం అయ్యేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. సామాజిక కార్యక్రమాల నిర్వహణకు గ్రామాల్లో కమ్యూనిటీ మండపాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కొనక గ్రామానికి ప్రత్యేక రేషన్ డిపో మంజూరు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చూడాలని కోరారు.

## ఆర్నాబ్ తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 21 (వార్త) :** ఆర్నాబ్ తుఫాన్ ప్రభావం నేపథ్యంలో రానున్న రెండు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక అధికారి సమగ్ర శిక్ష అభియాన్ ఏపీడీ వేణుగోపాల్ అధికారులును సూచించారు. సోమవారం తాహశీల్దార్ కార్యాలయంలో రెవిన్యూ, ఎంపీడీఓ, మున్సిపాల్టీ, ఇరిగేషన్ తోపాటు అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచిం చారు. తుఫాన్ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అప్రమత్తం చేయాలని వాతావరణ పరిస్థితులపై సమాచారం సేకరించి అవసరమైన చర్యలు ముందస్తుగానే చేపట్టాలని అధికారులుకు సూచించారు. ఇబ్బందులు తలెత్తే అకవాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ఆయా ప్రాంతాల్లో అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజలకు అత్యవసర సమయంలో సహాయ సహకారాలు అందించేందుకు సిబ్బందా ఉండాలని ప్రజల నుండి వచ్చే పిర్యాదులు సమస్యలపై అదికారులు తక్షణమే స్పందించాలని తెలిపారు. సహాయక చర్యల్లో ఎలాంటి జాప్యం జరగకుండా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రత కు తాహశీల్దార్ ఎన్ వెంకటరావు, ఎంపీడీఓ ప్రభాకరరావు, మున్సిపల్ కమీషనర్ ఎన్ రమేష్ తోపాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాలం అశోక్ కూడా అన్ని లైన్ శాఖల అధికారులతో అత్యవసర భేటి నిర్వహించారు.

## సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే శిరీష శంకుస్థాపన



**పలాస, సెప్టెంబరు 21 (వార్త):** పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో రూ.7.80 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్డు పనులకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం శంకుస్థాపన చేశారు. ఎరుకుల సత్యారావు భవనం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. స్థానికుల రాకపోకలకు వెసులుబాటు కల్పించాలని ఉద్దేశంతో వార్డులో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారి నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నూతన సీసీ రోడ్డు అందుబాటులోకి వస్తే స్థానిక నివాసితుల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ముఖ్యంగా నిత్యావసరాల కోసం పట్టణంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు రహదారి సౌకర్యం మెరుగుపడనుంది. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టి, ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా రహదారిని నిర్మించాలని ఆదేశించారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తూ మున్సిపాలిటీ పరిధిలో స్థానిక అవసరాలను గుర్తించి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు తెలిపారు. రహదారులు, కాలువలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడితే పట్టణంలోని నివాస ప్రాంతాల్లో ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో గురజాడ జయంతి



**సోంపేట, సెప్టెంబరు 21 (వార్త):** బారువ గ్రామంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మహాకవి సంఘసంస్కర్త గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమం నిర్వహించారు. తెలుగు విభాగం అధ్యక్షులు జి.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురజాడ తెలుగు భాషకు అందించిన సేవలు, ఆయన మహా రచనల ద్వారా మహాకవిగా ఎదిగిన తీరు, సామాజిక సంస్కరణలకు చేసిన ప్రయత్నాలు, దురాచార నివారణకు చేసిన కృషి గూర్చి రాజేంద్రప్రసాద్ వివరించారు. అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. సోంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మోహన్ రావు అధ్యక్షతన సోమవారం మహాకవి గురజాడ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. గురజాడ గూర్చి విద్యార్థులకు వివరించారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా యువ వ్యాపారవేత్త ఆనంద్ జన్మదిన వేడుకలు

**-స్నేహితులు, అభిమానుల మధ్య కేక్ కటింగ్..**

**-ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ**

**-ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానం**

**పలాస, సెప్టెంబరు 21 (వార్త):** స్నేహ జువెలర్స్ అధినేత, ప్రముఖ యువ వ్యాపారవేత్త బల్ల ఆనంద్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్నేహితులు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కేక్ కటింగ్ కార్యక్రమం సందడిగా సాగింది.

జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహించడంతో ఆయన శ్రేయోభిలాషులు అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన బల్ల ఆనంద్ అభిమానులు, స్నేహితులు అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి ఆహార పదార్థాలు అందించారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో అన్నదానంలో పాల్గొన్నారు.



జన్మదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన సేవా కార్యక్రమాలు పలువురి ప్రశంసలు అందుకున్నాయి. వ్యక్తిగత వేడుకలను సామాజిక సేవతో ముడిపెట్టడం ద్వారా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన అభిమానులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో గాలి కృష్ణారావు, చిన్ని, వైకుంఠరావు తదితరులు పాల్గొని బల్ల ఆనంద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546